

నిత్యాన్నదానానికి విరాళం


అన్నవరం: కృష్ణా జిల్లా గుడివాడకు చెందిన బోను నాగమణి సత్యదేవుని నిత్యాన్నదాన పథకానికి, గోసంరక్షణ ట్రస్ట్‌కు శనివారం రూ.రెండు లక్షల విరాళం సమర్పించారు. ఆమెకు అన్నదానం, గోసంరక్షణ బాండ్లను సూపరింటెండెంట్ సత్య శ్రీనివాస్ అందచేశారు.



వృద్ధురాలి సజీవ దహనం

పెద్దాపురం రాజీవ్ కాలనీలో ఓ వృద్ధురాలు అగ్ని ప్రమాదంలో చిక్కుకుని సజీవ దహనం అయ్యింది. చుట్ట వెలిగించి వదిలేయడమే ప్రమాదానికి కారణమని అధికారులు తేల్చారు. 8లో

1.18 లక్షల క్యూసెక్కుల విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి శనివారం సాయంత్రం 1,18,355 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడుదల చేశారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 9.70 అడుగులకు చేరింది. డెల్టా కాలువలకు 9,500 క్యూసెక్కుల నీరు వదిలారు.

న్యూస్‌రీల్

సాహిత్యానికి ఆవంత్స కృషి ఎనలేనిది : మృణాళిని



వేడుకల్లో మాట్లాడుతున్న కవి నందిని సిధారెడ్డి. చిత్రంలో మృణాళిని తదితరులు

బోట్‌క్లబ్ (కాకినాడసిటీ): సాహిత్యం కోసం ఆవంత్స సోమసుందర్ ఎంతో కృషి చేశారని సాహిత్య అకాడమీ తెలుగు విభాగం కన్వీనర్ సి.మృణాళిని అన్నారు. సాహిత్య అకాడమీ, క్రియ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో వజ్రాయుధ కవి ఆవంత్స జయంతిని గాంధీ భవన్‌లో శనివారం నిర్వహించారు. సాహితీ ప్రక్రియలలో ఆయన చేసిన కృషిని కొత్త తరాలకు పరిచయం చేయడానికి శత జయంతి వేడుకలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రముఖ కవి నందిని సిధారెడ్డి మాట్లాడుతూ పిఠాపురంలో నివసించిన సోమసుందర్ నిజాం పాలకులను ఎదిరిస్తూ వెలువరించిన గేయకావ్యం 'వజ్రాయుధం' నాటి తెలంగాణ పరిస్థితులను కళ్లకు కట్టిందన్నారు. క్రియ సొసైటీ కార్యదర్శి ఎస్ఎస్ఆర్ జగన్నాథ రావు మాట్లాడుతూ ఈ వేడుకలలో తాము పాలు పంచుకోవడం ఆనందంగా ఉందన్నారు. జి.సీ తారామస్వామి అధ్యక్షతన జరిగిన సదస్సులో ఎస్.ఈశ్వరరెడ్డి, బొల్లోజు బాబా, వాడ్రేవు వీర లక్ష్మి దేవి, చందు సుబ్బారావు, సాహిత్యంపై జరిగిన సమావేశంలో కస్తూరి నాగ మురళీ శంకర్, నండూరి రాజగోపాల్, ఆర్.సీతారామారావు ప్రసంగించారు.

నేడూ బిల్లులు చెల్లించొచ్చు

కాకినాడ: జిల్లాలోని అన్ని విద్యుత్ రెవెన్యూ కార్యాలయాల్లోని విద్యుత్ వసూళ్ల కౌంటర్లలో ఆదివారం కూడా బిల్లులు చెల్లించవచ్చని ఏపీ ఈపీ డీసీఎల్ సూపరింటెండెంట్ ఇంజినీర్ జి.ప్రసాద్ శనివారం పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని బిల్లులు చెల్లించాలని, సెక్షన్ ఆఫీస్ కలెక్షన్ కౌంటర్లతో పాటు ఏటీపీ సెంటర్లలో కూడా విద్యుత్ బిల్లులు చెల్లించవచ్చని తెలిపారు.

ఆయుధ ప్రదర్శనకు విశేష స్పందన



తుపాకీ గురిపెడుతున్న విద్యార్థిని ఆసక్తిగా తిలకిస్తున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్

కాకినాడ క్రైం: పోలీసు అమరవీరుల దినోత్సవంలో భాగంగా జిల్లా పోలీసుశాఖ ఆధ్వర్యంలో స్థానిక ఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన ఆయుధ ప్రదర్శనకు విశేష స్పందన లభించింది. పోలీసు శాఖ వినియోగించే వివిధ రకాల తుపాకులు, బులెట్లు, బాంబు డిస్పోజల్ పరికరాలను ఇందులో ప్రదర్శించారు. నగరంలోని పలు ప్రైవేటు, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు వాటిని ఆసక్తిగా తిలకించారు. ఆదివారం కూడా ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు ఎస్పీ విక్రాంత్ పాటిల్ తెలిపారు.

లాటరీ వారిది.. లిక్కర్ వీరిది!



- మద్యం మాఫియాకు టీడీపీ స్కెచ్
- సిండికేట్ల ఏర్పాటుకు సమావేశాలు
- కాదన్న యజమానులకు బెదిరింపులు
- నియోజకవర్గ నేత ఆధ్వర్యంలో చిన్ననేత అక్రమ దందా
- ఓ అధికారి నేతృత్వంలో మంత్రాంగం



పిఠాపురంలో నిర్వహిస్తున్న ఓ మద్యం దుకాణం

పిఠాపురం: ఎలాగైనా మద్యం దుకాణాలు దక్కించుకోవాలనుకున్న టీడీపీ ముఖ్య నేతలకు భంగపాటు ఎదురైంది. తాము అనుకున్న ప్రాంతాల్లో ఇతరులకు దుకాణాలు రావడంతో చేసేదేమీ లేక మద్యం మాఫియాకు స్కెచ్ వేయడంలో టీడీపీ నేతలు నిమగ్నమైనట్లు తెలుస్తోంది. టీడీపీ నియోజకవర్గ నేత ఆదేశాలతో, ఎక్సైజ్ శాఖ అధికారి అండదండలతో టీడీపీలో ఓ 'చిన్న' నేత సిండికేట్ ఏర్పాటు చేయాలంటూ మద్యం దుకాణాల యజమానులపై తీవ్ర ఒత్తిడి తెస్తున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. ఇటీవల టీడీపీ నియోజకవర్గ నేత తన కార్యాలయంలో పిఠాపురం మండల మద్యం దుకాణ యజమానులతో రహస్య సమావేశం నిర్వహించి అందరూ సిండికేటుగా తయారవ్వాలని దానికి టీడీపీ నేత నేతృత్వం వహిస్తారని ఆయన చెప్పినట్టుగా మనమంతా నడుచుకోవాలని లేకుంటే షాపులు నడవనిచ్చేది లేదని హుకుం జారీ చేసినట్లు తెలిసింది. తాము రూ.లక్షలు పెట్టుబడి పెట్టి దుకాణాలు లాటరీలో దక్కించుకుంటే ఏవీ దక్కించుకోలేని, ఏ సంబంధం లేని టీడీపీ నేత తమపై అధికారం చెలాయించడమేమిటని కొందరు షాపు యజమానులు టీడీపీ నేత నిర్ణయాన్ని వ్యతిరేకించినట్లు తెలిసింది. దీంతో ఆగ్రహం వ్యక్తం చేసిన టీడీపీ నేత ఒక్క దుకాణం ఉండాల్సిన చోట పోటీగా మరో దుకాణాన్ని ఏర్పాటు చేయించి విక్రయాలు లేకుండా చేసి తీవ్ర మానసిక వత్తిడికి గురి చేస్తున్నాడని ఓ దుకాణం యజమాని తోటి యజమానుల వద్ద వాపోయినట్లు కొందరు చెప్తున్నారు. ఇప్పటికే పిఠాపురం మండలం కందరాడలో తమ మాట వినని బ్రాందీ షాపు యజమానిపై కక్ష సాధింపు చర్యగా వేరొక చోట ఏర్పాటు చేయాల్సిన దుకాణాన్ని అతనికి సమీపంగా ఏర్పాటు చేయడం చర్చనీయాంశంగా మారింది.

చిన్న నేతకు పెద్ద పేరే ఉంది

పిఠాపురంలో అనధికారికంగా మద్యం సిండికేటుగాడిగా మారుతున్న టీడీపీ చిన్న నేతకు గతంలో పెద్ద పేరే ఉందంటున్నారు. గతంలో మద్యం మాఫియాను నడిపిన సదరు నేతకు మద్యం సీసాల మూతలు తీసి నాటు సారా కలిపి మద్యంగా విక్రయించిన ఘన చరిత్ర ఉందని చెప్పుకొంటున్నారు. అలాంటి నేతను సిండికేటు నేతగా పెడితే ఇక తమ మద్యం దుకాణాలు అన్ని కల్తీ మద్యం దుకాణాలుగా మారిపోతాయని, తద్వారా తమ దుకాణాలు సీజ్ అయ్యే అవకాశాలు ఉన్నాయని పలువురు యజమానులు ఆందోళన చెందుతున్నట్టు చెప్పుకొంటున్నారు. ఎటువంటి మద్యం దుకాణం లేకుండా కనీసం ఏ దుకాణంలోనూ వాటా అయినా లేకుండా సిండికేటు నాయకుడిగా టీడీపీ నేతను ఎలా పెడతారని పలువురు యజమానులు ప్రశ్నిస్తున్నట్లు సమాచారం.

బేరసారాలు.. బెదిరింపులు..

ఆన్‌లైన్‌లో వచ్చినా లాటరీలో వచ్చినా మీ ఇష్టం వచ్చినట్లు చేయడానికి కుదరదు.. మేం చెప్పినట్లు వినాల్సిందే.. లేక పోతే షాపులు ఒక్క రోజు కూడా నడవవు అంటూ టీడీపీ నేత పలువురు యజమానులకు హుకుం జారీ చేసినట్లు బాహాటంగానే చెప్పుకొంటున్నారు. చెప్పిన మాట విని టీడీపీ నేత ఆధ్వర్యంలో సిండికేటు ఏర్పాటు చేసి ఆయన ఆధ్వర్యంలో మద్యం విక్రయాలు జరిపి తీరాల్సిందేనని, కాదంటే వారి పని పడమని బెదిరింపులకు దిగినట్లు ప్రచారం జరుగుతోంది.

ఎక్సైజ్ అండదండలతో..

నిబంధనలు పాటించడం, ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే మద్యం విక్రయించడం వంటి పనులను పర్యవేక్షించాల్సిన ఎక్సైజ్ శాఖ అధికారి టీడీపీ నేతకు తొత్తుగా మారినట్లు షాపుల యజమానులు చెప్పుకొంటున్నారు. ఎటువంటి షాపు లేని టీడీపీ నేతను తన కార్యాలయంలో కూర్చోబెట్టుకుని సిండికేటు ఏర్పాటుకు ఆయన ప్రయత్నాలు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ అక్రమ దందాను నివారించాల్సిన సదరు ఎక్సైజ్ అధికారే స్వయంగా సిండికేటు ఏర్పాటుకు టీడీపీ నేతతో కలిసి ప్రయత్నాలు చేయడం పిఠాపురం మద్యం దుకాణ యజమానుల్లో చర్చనీయాంశంగా మారింది.

ఈ విషయంపై పిఠాపురం ఎక్సైజ్ సీఐ శివరామరాజును వివరణ కోరగా పిఠాపురంలో ఎటువంటి సిండికేటు ఏర్పాటు లేదన్నారు. మద్యం దుకాణ యజమానుల్లో సఖ్యత లేదని, ఎవరి మాటా ఎవరూ వినడం లేదని తెలిపారు.

గృహ నిర్మాణాలు వేగవంతం చేయండి

కలెక్టర్ షణ్మోహన్



గృహ నిర్మాణాలపై నిర్వహించిన సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ షణ్మోహన్

కాకినాడ సిటీ: జిల్లాలో గృహ నిర్మాణ పనులు వేగవంతం చేసి రానున్న మార్చి నాటికి పూర్తిచేయాలని కలెక్టర్ షణ్మోహన్ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో హౌసింగ్, ఉపాధి హామీ పథకం నిధులతో చేపట్టిన పనులు, అంగన్‌వాడీ కేంద్రాలు, తాగునీరు, మరుగుదొడ్ల ఏర్పాటు, క్లోరినేషన్ పనులు, డంపింగ్ యార్డు, అవసరమైన ప్రాంతాలు, మధ్యాహ్నం భోజనం నాణ్యత తనిఖీ, ఆర్వో ప్లాంట్ల పనితీరు వంటి అంశాలపై ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లతో కలిసి క్షేత్రస్థాయిలో వివిధ శాఖల ఇంజినీరింగ్ అధికారులు, ఏపీడీ, ఏపీవో, డీఈ, ఈఈలు పాల్గొన్న కార్యక్రమంలో గృహ నిర్మాణాలతో పాటు జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన సీసీ రోడ్ల పనుల్లో పురోగతి కనబరచాలని సూచించారు. జిల్లాలో అన్ని ప్రాంతాల్లో మంచినీటి ట్యాంకుల క్లోరినేషన్ పనులు పూర్తి చేయాలన్నారు. జిల్లాలో ఈనెల 25 నుంచి ప్రారంభమైన పశుగణన ప్రక్రియ సజావుగా సాగేలా కృషి చేయాలన్నారు. సమావేశంలో హౌసింగ్ పీడీ ఎన్‌వీవీ సత్యనారాయణ, డ్వామా పీడీ ఎ.వెంకటలక్ష్మి, జెడ్పీ సీఈవో వీవీవీఎస్ లక్ష్మణరావు, డీపీవో వి.రవికుమార్, సీపీవో పి.త్రినాథ్, ఐసీడీఎస్ పీడీ కె.ప్రవీణ్, పశుసంవర్ధకశాఖ జేడీ ఎస్.సూర్యప్రకాశరావు తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

భక్తులతో రత్నగిరి కిటకిట



తిరుచ్చి వాహనంపై ఊరేగుతున్న సత్యదేవుడు, అమ్మవార్లను దర్శించుకుంటున్న భక్తులు

- సత్యదేవుని దర్శించిన 40 వేల మంది
- దేవస్థానం ఆదాయం రూ.40 లక్షలు
- తిరుచ్చి వాహనంపై ఘనంగా స్వామివారి ప్రాకారసేవ

అన్నవరం: వేల సంఖ్యలో వచ్చిన భక్తులతో శనివారం రత్నగిరి కిటకిటలాడింది. భక్తులు సత్యదేవుని వ్రతమాచరించి స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయానికి వచ్చిన భక్తులతో మంటపాలన్నీ నిండిపోయాయి.

సుమారు 40 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించగా, స్వామివారి వ్రతాలు 1,600 నిర్వహించారు. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.40 లక్షలు ఆదాయం సమకూరింది. నిత్యాన్నదాన పథకంలో ఐదు వేల మంది భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు. కాగా ఉదయం పది గంటలకు తిరుచ్చి వాహనంపై సత్యదేవుడు, అనంతలక్ష్మి, సత్యవతీదేవి అమ్మవార్ల ఉత్సవమూర్తులతో అర్చకులు కంచిభట్ల రామ్‌కుమార్ స్వామి ప్రాకారసేవ నిర్వహించారు.

ఎఫ్ఐఆర్ నమోదులో అలసత్వం శోచనీయం

- మాజీ మంత్రి కురసాల కన్నబాబు
- జీజీహెచ్‌లో సునీతకు పరామర్శ



బాధితురాలు సునీతను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యేలు కన్నబాబు, వెంకటరామయ్య

కాకినాడ క్రైం: కరప మండలం పెనుగుదురులో ఫీల్డ్ అసిస్టెంట్‌గా పనిచేస్తూ జనసేన నాయకుల వేధింపులతో ఆత్మహత్యా యత్నానికి పాల్పడిన పులపకూర సునీతను వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు, గాజువాక మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకటరామయ్య జీజీహెచ్‌లో పరామర్శించారు. ఈ సందర్భంగా కన్నబాబు మాట్లాడుతూ సంఘటన జరిగి ఐదు రోజులు గడిచినా నేటికి ఎఫ్ఐఆర్ నమోదు చేయకపోవడం పోలీసుల అలసత్వానికి అద్దం పడుతోందని విమర్శించారు. అధికార నేతల ఒత్తిళ్లతో పోలీసులు కూటమి కార్యకర్తలుగా వ్యవహరిస్తున్నారన్నారు. దళిత చిరుద్యోగి ఆత్మహత్యకు యత్నిస్తే పవన్‌కల్యాణ్ సహా కూటమి నేతలు ఎవరూ స్పందించకపోవడం ఆవేదన కలిగించిందన్నారు. బాధిత మహిళకు న్యాయం జరిగే వరకు వైఎస్సార్ సీపీ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.

చర్చ జరిగితే మహదానందమే..

- నేడు రత్నగిరిపై కార్తికమాస ఏర్పాట్లపై సమావేశం
- భక్తులకు సౌకర్యాలపై దృష్టి సారిస్తే మంచిది



సత్యదేవుని ఆలయం ఏరియల్ వ్యూ

అన్నవరం: కార్తిక మాసం వచ్చే నెల ఒకటి నుంచి ప్రారంభం కానుంది. లక్షల మంది భక్తులతో రత్నగిరి కిటకిటలాడనుంది. ఏటా ఈ మాసంలో సుమారు 20 లక్షల మంది భక్తులు వస్తుండగా, రూ.12 కోట్ల పైబడి ఆదాయం సమకూరుతోంది. సత్యదేవుని వ్రతాలు సంవత్సరమంతా సుమారు ఆరు లక్షలు జరిగితే, ఈ కార్తికంలోనే లక్ష పైబడి జరుగుతాయి. అయితే లక్షలాదిగా వచ్చే భక్తులకు చేసే ఏర్పాట్లపై ఆదివారం రత్నగిరి ప్రకాష్‌సదన్‌లో ట్రస్ట్‌బోర్డు సమావేశం జరగనుంది. వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొనే ఈ సమావేశంలో భక్తులకు మెరుగైన సౌకర్యాలపై దృష్టించాల్సిన అవసరం ఉంది. అవి ఇలా..

వీటిపై దృష్టి సారిస్తారా..

- నవంబర్ 13వ తేదీ సాయంత్రం 6.30 గంటలకు పంపా నదిలో సత్యదేవునికి తెప్పోత్సవం జరగనుంది. హంస వాహనంపై జరిగే ఈ కార్యక్రమానికి అర్చకులు, పండితులు, సన్నాయి మేళం వారిని మినహా ప్రముఖులతో సహా ఎవరినీ మూడేళ్లుగా అనుమతించడం లేదు. ఈ ఏడాదీ ఇదే ఆనవాయితీ పాటిస్తే ఇబ్బంది ఉండదు.
- పౌర్ణిమ సందర్భంగా 15న ఉదయం ఏడు గంటలకు సత్యదేవుని గిరిప్రదక్షిణ పల్లకీ మీద శాస్త్రోక్తంగా, మధ్యాహ్నం రెండు గంటలకు ప్రచార రథంతో నిర్వహించాలని నిర్ణయించారు. ప్రతి ఏడాది ఉదయం ఏడు గంటల నుంచి 12 గంటల వరకూ మాత్రమే నిర్వహించేవారు. అయితే ఎప్పటి మాదిరిగానే ఉదయం ఏడు గంటల నుంచి గిరిప్రదక్షిణ నిర్వహించాలనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. సాయంత్రం ఆరు గంటలకు పంపా నది వద్ద నదీ హారతులు, రాత్రి ఏడు గంటలకు తొలిపాంచా వద్ద జ్వాలాతోరణం జరుగుతుంది. అందువల్ల మధ్యాహ్నం గిరిప్రదక్షణతో ఈ రెండు కార్యక్రమాలకు సమయం సరిపోదనే అభిప్రాయం ఆలయ సిబ్బంది నుంచి వ్యక్తమవుతోంది. గిరి ప్రదక్షిణ మార్గంలో భక్తులకు తాగునీరు, మజ్జిగ, పాలు, పండ్లు పంపిణీ చేయాలి.
- ఏటా కార్తికమాసంలో ఘాట్ రోడ్‌లో ట్రాఫిక్ నిలిచిపోతోంది. పెద్ద వాహనాలను కొండ దిగువన ఆపివేయాలి. ఆటోలు, ఇతర వాహనాలను కూడా సత్యగిరి జంక్షన్ వరకూ అనుమతించాలి. అక్కడి నుంచి దేవస్థానం వాహనాల్లో ఆలయం వద్దకు తరలిస్తే మంచిది. దీనిపై కూడా సమావేశంలో చర్చించాలి.
- సత్యదేవుని ఆలయానికి వచ్చే భక్తులకు మంచి నీరు, పులిహోర, దద్దోజనం, మధ్యాహ్నం సాంబారు రైస్, వంటి వాటిని పంపిణీ చేయాలి. పిల్లలకు పాలు, బిస్కెట్లు వంటివి కూడా ఏర్పాటు చేయాలి.
- రత్నగిరిపై సత్రాల్లో 600 గదులు మాత్రమే ఉన్నాయి. వీటిలో కనీసం వంద గదులు వీఐపీ కోటాలో బ్లాక్ చేస్తున్నారు. మిగిలిన 500 గదులు మాత్రమే భక్తులకు అద్దెకు ఇస్తుంటారు. వేల సంఖ్యలో వచ్చే భక్తులకు ఇవి ఏ మాత్రం సరిపోవు. సాధ్యమైనంత వరకూ కొండ దిగువన కళాశాల మైదానం, రత్నగిరిపై పలుచోట్ల తాత్కాలికంగా మరుగుదొడ్లు, స్నానపు గదులు ఏర్పాటు చేసే విషయం కూడా పరిశీలించాలి. అదే విధంగా తాత్కాలిక విశ్రాంతి షెడ్లు నిర్మించాలి.
- ఈఓ కార్యాలయం ఎదురుగా గతంలో పురుషులు, మహిళలకు విడిగా 20 టాయిలెట్స్ ఉండేవి. వాటిని 2023లో కూల్చేశారు. ఇప్పుడు అక్కడ ఒక్క టాయిలెట్ కూడా లేదు. అక్కడ తాత్కాలికంగానైనా టాయిలెట్స్ నిర్మించాలి.
- రత్నగిరితో పాటు, కొండదిగువ రైల్వే స్టేషన్ వద్ద నుంచి టోల్ గేట్ వరకూ దేవస్థానమే పారిశుధ్య పనులు నిర్వహించాలి. పంచాయితీ సిబ్బంది కొరతతో పారిశుధ్యం అంతంత మాత్రంగానే ఉంటోంది.
- రత్నగిరి మెట్లదారి, ఘాట్, రైల్వేస్టేషన్, మెయిన్ రోడ్లలో విద్యుత్ దీపాల నిర్వహణపై దృష్టి సారించాలి.
- కొండదిగువ నుంచి రత్నగిరి, రైల్వే స్టేషన్‌కు దేవస్థానం బస్సులు నాలుగు వరకూ నడపాలి. అదే విధంగా రైల్వే స్టేషన్ వద్ద దేవస్థానం బస్ టికెట్ కౌంటర్ ఏర్పాటు చేయాలి. రత్నగిరి నుంచి సత్యగిరికి భక్తులను తరలించడానికి ఉచిత వాహనాలు కూడా నడపాలి.
- దేవస్థానంలో పోలీస్ ఔట్ పోస్టును ఆలయానికి దగ్గరగా ఏర్పాటు చేయాలి. ఇటీవల కాలంలో పలుచోట్ల, వనదుర్గమ్మ ఆలయం వద్ద ఉచిత డార్మెట్రీలో కూడా దొంగల సంచారం పెరిగింది. డార్మెట్రీ ఎంట్రన్స్, దేవస్థానంలో సీసీ కెమెరాలు లేనిచోట వాటిని ఏర్పాటు చేయాలి.
- తిరుగు ప్రయాణంలో అన్నవరం రైల్వే స్టేషన్‌లో కౌంటర్ వద్ద రద్దీ కారణంగా సకాలంలో టిక్కెట్లు తీసుకోలేకపోతున్నారు. విశాఖపట్నం వైపు వెళ్లే భక్తులు మూడో నంబర్ ప్లాట్‌ఫారమ్ నుంచి ఒకటో నంబర్ ప్లాట్‌ఫారమ్‌కు వెళ్లి టిక్కెట్లు తీసుకుని తిరిగి మూడో నంబర్‌కి రావాల్సి వస్తోంది. ఈ ఇబ్బందులు తొలగించేందుకు కార్తికమాసం నెల రోజులూ దేవస్థానంలో తాత్కాలిక రైల్వే కౌంటర్ లేదా టిక్కెట్ వెండింగ్ మెషీన్ ఏర్పాటు చేస్తే ఇబ్బంది ఉండదు. వందే భారత్, గరీబ్‌రథ్ రైళ్లను నిలుపుదల చేసేలా ప్రజాప్రతినిధులు చొరవ చూపాలి.

క్లుప్తంగా

పురుగు మందు తాగి వ్యక్తి మృతి

కిర్లంపూడి: అప్పుల బాధ తాళలేక పురుగు మందు తాగి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటనపై కేసు నమోదు చేసినట్టు హెడ్ కానిస్టేబుల్ ఎస్. వెంకటరమణ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మండలంలోని కృష్ణవరం గ్రామానికి చెందిన అరిపి సత్తిబాబు (31) రెండేళ్ల కిందట కుటుంబ అవసరాల నిమిత్తం రూ. 2 లక్షలు అప్పు చేశాడు. మృతుడికి ఎడమ కాలు అంగ వైకల్యంతో బాధపడుతున్నాడు. ఆటో నడుపు కొంటూ తన భార్య, ఎనిమిదేళ్ల కుమార్తెను పోషించుకుంటున్నాడు. అప్పులు తీర్చలేకపోతున్నాననే మానసిక వేదనతో ఈ నెల 21న మధ్యాహ్నం గ్రామ శివారు కొబ్బరి తోటలోకి వెళ్లి గడ్డి మందు తాగాడు. అనంతరం తన స్నేహితుడు కాసిన బాబీకి ఫోన్ చేసి జరిగిన విషయం తెలిపాడు. దీంతో మృతుడు అన్నయ్య ఆంజనేయుడు, బాబీ అక్కడకు చేరుకుని ప్రత్తిపాడు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. మృతుడి భార్య భవాని ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

వ్యక్తి దుర్మరణం



ప్రమాదంలో ధ్వంసమైన కారు

రాజానగరం: జాతీయ రహదారిపై తూర్పుగానుగూడెం వద్ద వ్యాన్, కారు ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. రాజమహేంద్రవరం నుంచి మురారి వైపు వెళ్తున్న ఐసర్ వ్యాన్ తూర్పుగానుగూడెం శివారులో జంక్షన్ వద్ద తిరిగి రాజమహేంద్రవరం వెళ్లేందుకు యూ టర్న్ తీసుకుంటుండగా, అదే సమయంలో మురారి వైపు నుంచి వస్తున్న కారు ఢీకొంది. కారు ముందు భాగం తునాతునకలై డ్రైవింగ్ చేస్తున్న తొండంగి మండలం, వలసపాకల అగ్రహారానికి చెందిన నట్టే వెంకటరమణ (32) అక్కడికక్కడే మృతి చెందాడు. సాఫ్ట్‌వేర్ ఉద్యోగి అయిన అతను రాజమహేంద్రవరంలో జరిగే ఒక శుభ కార్యానికి వెళ్తుండగా ప్రమాదానికి గురయ్యాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ మేరకు కేసును ఎస్సై మనోహర్ దర్యాప్తు చేస్తున్నారు.

అభివృద్ధి ప్రణాళికలపై అవగాహన అవసరం

సామర్లకోట: అభివృద్ధి ప్రణాళికలు తయారు చేయడంపై అవగాహన ఉండాలని విస్తరణ శిక్షణా కేంద్రం ప్రిన్సిపాల్ జె.వేణుగోపాల్ అన్నారు. అనకాపల్లి, విశాఖపట్నం, ఏలూరు, పార్వతీపురం మన్యం జిల్లాలకు చెందిన డీపీఓలు, ఎల్‌డీఓలు, ఎంపీడీఓలు, ఈఓపీఆర్డీలు, పంచాయతీ కార్యదర్శులు, సాంకేతిక సిబ్బందికి స్థానిక విస్తరణ శిక్షణా కేంద్రంలో రెండు రోజుల శిక్షణ జరిగింది. శనివారం ముగింపు కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వేణుగోపాల్ మాట్లాడుతూ జిల్లా పరిషత్తు, మండల పరిషత్తు, గ్రామ పంచాయతీల అభివృద్ధికి సంబంధించి ప్రణాళికలు తయారు చేయడం ఎంతో కీలకమన్నారు. దీనిని గుర్తించిన రాష్ట్ర పంచాయతీ రాజ్ అండ్ గ్రామీణాభివృద్ధి సంస్థ ఈటీసీల పరిధిలోని అధికారులకు ఎంటీటీలుగా శిక్షణ ఇవ్వాలని నిర్ణయించిందన్నారు. ఈ మేరకు శిక్షణ పొందిన అధికారులు ఆయా జిల్లాల్లో శిక్షణ ఇవ్వాల్సి ఉంటుందని చెప్పారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి అభివృద్ధి ప్రణాళికలు తయారు చేసే విధానంపై ఇచ్చిన శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ అభివృద్ధి ప్రణాళికల ఆధారంగానే జిల్లా పరిషత్తు, మండల పరిషత్తు, గ్రామ పంచాయతీల అభివృద్ధి ఆధారపడి ఉంటుందన్నారు. దీంతో పాటు ఆన్‌లైన్‌లో నమోదు చేసే విధానంపై అవగాహన పెంచుకోవాలన్నారు. ఈ మేరకు ఆయా ప్రణాళికల ఆధారంగా ప్రభుత్వం నుంచి నిధులు వస్తాయని తెలిపారు. సోమవారం నుంచి శ్రీకాకుళం, విజయనగరం, అల్లూరి సీతారామరాజు, కాకినాడ, తూర్పు గోదావరి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, పశ్చిమ గోదావరి జిల్లాలకు చెందిన అధికారులకు శిక్షణ ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో శిక్షణ కేంద్రం వైస్ ప్రిన్సిపాల్ ఇ.కృష్ణమోహన్, ఫ్యాకల్టీలు పి.శ్రీనివాసరావు, బి.ఆంజనేయులు, పి.ప్రసాద్, కేఆర్ నిహారిక, ఎస్కే మోహీద్దీన్, పంచాయతీరాజ్ శాఖ జాయింట్ డైరెక్టర్ జి.రమణ తదితరులు పాల్గొన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్లు అందజేశారు.



శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్లు అందజేసిన ప్రిన్సిపాల్ వేణుగోపాల్

రాష్ట్ర స్థాయి లాన్ టెన్నిస్ పోటీలకు సన్నద్ధం



రాష్ట్ర స్థాయి లాన్ టెన్నిస్ పోటీలకు సిద్ధం చేసిన డీఎస్ఏ టెన్నిస్ కోర్టు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): కాకినాడలో రాష్ట్ర స్థాయి లాన్ టెన్నిస్ అండర్-14, 17, 19 విభాగ పోటీలను జిల్లా పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. రాష్ట్ర లాన్ టెన్నిస్ అసోసియేషన్ సహకారంతో ఈ పోటీల నిర్వహణకు స్థానిక డీఎస్ఏ క్రీడా మైదానంలోని టెన్నిస్ కోర్టులను నిర్వాహకులు సిద్ధం చేశారు. ఈ పోటీలకు వివిధ జిల్లాల నుంచి 350 మంది క్రీడాకారులు, 100 క్రీడాధికారులు, కోచ్ మేనేజర్లు, నిర్వహణా కమిటీ సభ్యులు, సాంకేతిక సిబ్బంది హాజరు కానున్నారు. బాలికలకు డీఎస్ఏ తైక్వాండో హాలులో, బాలురకు డీఎస్ఏ ఇండోర్ హాల్ మేడపై, మదర్‌థెరిసా మున్సిపల్ కార్పొరేషన్ స్కూల్ గుడారిగుంటలో వసతి ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా ఎస్‌జీఎఫ్ఐ జిల్లా కార్యదర్శి జార్జి మాట్లాడుతూ జాతీయ స్థాయి ప్రమాణాలతో ఏర్పాట్లు చేశామన్నారు. వివిధ జిల్లాల నుంచి హాజరవుతున్న క్రీడాకారులకు ఏ విధమైన ఇబ్బందులు కలగకుండా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని తెలిపారు. ఈ ఏర్పాట్లను ఎస్‌జీఎఫ్ఐ జిల్లా సంయుక్త కార్యదర్శులు సునీల్, పరశురాం, జిల్లా పీఈటీ సంఘ అధ్యక్షుడు జార్జి శనివారం పర్యవేక్షించారు. రాష్ట్ర లాన్‌టెన్నిస్ సంఘ కార్యదర్శి రామ్‌కుమార్ సాంకేతిక సహకారం అందిస్తున్నారు.

వ్యాపార రంగంపై అవగాహన పెంచుకోవాలి



విజేతలకు బహుమతులు అందిస్తున్న మునిరాజ్ మయార్ తదితరులు

పెద్దాపురం: వ్యాపారం రంగంపై విద్యార్థి దశ నుంచే అవగాహన పెంచుకోవాలని హైదరాబాద్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ మునిరాజ్ మయార్ అన్నారు. పెద్దాపురం శ్రీప్రకాష్ సినర్జీ పాఠశాలలో శనివారం 8 నుంచి 12 తరగతి విద్యార్థులకు కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ విద్యార్థులతో దిశా-2024 కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ సీహెచ్ విజయ్‌ప్రకాష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో మునిరాజ్‌మయార్, కాకినాడ సరళా ఫుడ్స్ అధినేత హానీ అగర్వాల్ మాట్లాడుతూ దిశ కార్యక్రమం విద్యార్థుల దశదిశలను మారుస్తుందన్నారు. విజయ్ ప్రకాష్ మట్లాడుతూ దిశ కార్యక్రమం ద్వారా విద్యార్థుల ఆదాయం, ఖర్చులకు సంబంధించిన అకౌంట్స్ అన్ని ప్రత్యక్షంగా తెలుస్తాయన్నారు. అనంతరం పోటీల్లో విజేతలకు బహుమతులు ఇచ్చారు. డాక్టర్ సంతానం, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

వృద్ధురాలి సజీవ దహనం



బూరమ్మ మృతదేహాన్ని బయటకు తీసుకువస్తున్న అగ్నిమాపక సిబ్బంది

పెద్దాపురం: స్థానిక రాజీవ్ కాలనీలో ఓ వృద్ధురాలు పూరి గుడిసెలో చిక్కుకుని సజీవ దహనం అయ్యింది. పెద్దాపురం అగ్నిమాపకాధికారి జగన్నాథం, ఎస్ఐ మౌనిక కథనం ప్రకారం.. స్థానిక శివారు రాజీవ్ కాలనీలో పూరి గుడిసెలో కనకాల బూరమ్మ (75) ఉంటోంది. శనివారం రాత్రి అగ్ని ప్రమాదం జరిగి ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. ఆమె చుట్టను వెలిగించి నిర్లక్ష్యంగా ఉండడం కారణంగానే పూరి గుడిసెకు నిప్పంటుకోవడంతో పాటు ఆమె గుడిసెలో ఇరుక్కుపోయింది. ఆమె మృతదేహాన్ని స్థానిక ఏరియా ఆసుపత్రికి తరలించారు.

హాస్టల్ విద్యార్థులకు అస్వస్థత

నల్లజర్ల: దూబచర్ల గాంధీకాలనీలోని న్యూ లైఫ్ హైస్కూల్‌లో 15 మంది హాస్టల్ విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. శనివారం వీరిని ప్రత్యేక వాహనంలో వార్డెన్ రవిరాజు నల్లజర్ల ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తీసుకువచ్చారు. వారికి ఒళ్లంతా ఎలర్జీలు, కళ్ల కలకతో ఉన్నారు. ఆహారం లేక నీరు కలుషితం అయ్యిందా అనే విషయాలు తెలియాల్సి ఉంది. ఇక్కడ పదో తరగతి వరకూ చదువుతూ హాస్టల్‌లో ఉండే బాలబాలికలు మొత్తం 190 మంది వరకూ ఉన్నారు. తమకు తరచూ ఇదే విధంగా చర్మ సంబంధిత వ్యాధులు వస్తున్నాయని విద్యార్థులు పూర్ణచందు, రిషి, అఖిల్, పృథ్వీ, విశ్వతేజ తదితరులు వివరించారు. డాక్టర్ గంగాధరరావు వారందరికీ చికిత్స చేసి మందులు ఇచ్చి పంపారు. ఆ హాస్టల్ విద్యార్థులకు తరచూ ఇదే విధమైన రుగ్మతలు వస్తున్నాయని ఆయన చెప్పారు. ఈ విషయం తెలుసుకున్న ఇన్‌చార్జి తహసీల్దార్ శాంతిప్రియ హాస్టల్‌ను పరిశీలించారు. తాగునీరు, టాయిలెట్లు, వంటగది, ఆహార పదార్థాలను చూశారు. దీనిపై కరస్పాండెంట్ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ దసరా సెలవులకు వెళ్లిన విద్యార్థులు ఇటీవలే హాస్టల్‌కు తిరిగి వచ్చారని, జనరల్ చెకప్‌లో భాగంగానే విద్యార్థులను ఆసుపత్రికి పంపామన్నారు. ఎటువంటి రుగ్మతలు లేవని వివరణ ఇచ్చారు.